ఉగాది పచ్చడి

పూడిపెద్ది శేషశర్మ

''ఒరేయ్ రవీ, ఆరయింది. ఇంకో అరగంటలో మేం బయలుదేరతాం. లేస్తావా, లేదా ఇంకాస్సేపు పడుక్కుంటావా?''. శంకర్ అరుపుకి తెలివొచ్చి గడియారంకేసి చూశా. ఆరవుతోంది. అప్పుడు గుర్తుకొచ్చింది తనకు. ఆరోజు ఉగాది పండుగ. శనివారంకావడంమూలాన, ఆ ఊళ్లోఉన్న వెంకటేశ్వరస్వామికోవెలకి ఉదయాన్నే బయలుదేరారు శంకర్, భార్యలక్ష్మి, కూతురు శోభ. గతమూడురోజులుగా జరుగుతున్న ఫిజిక్సు సమావేశాలకు లాసేంజలిస్ నుండి ఈవూరు వచ్చాడుతను. మూడురోజులు హొటలులోఉండి, ముందురోజు రాత్రి చిన్ననాటి స్నేహితుడు శంకర్‌తో కాలక్షేపం చేద్దామని శంకర్ ఇంటికి వచ్చేడు తను. ఆమధ్యాహ్నం నాలుగు గంటలకి తిరుగుప్రయాణం. ఉదయాన్నే శంకర్‌వాళ్లు కోవెలకు బయలుదేరదామంటే తనూ వస్తానన్నాడు వాళ్లతో ముందురోజు రాత్రి. అందుకే శంకర్ తనని అంతహడావిడిగా లేపుతున్నాడు. లేచి, త్వరగా స్నానం ముగించుకొని వచ్చేసరికి, లక్ష్మి కాఫీ కలుపుతోంది.

''ఈయనగారి హడావిడితో మిమ్మల్ని నిద్రపోనీవకుండా లేపేశారా?'' అంటూ నవ్వుతూ కాఫీ అందించింది శంకర్ భార్యలక్ష్మి.

''అదేం ఫరవాలేదండీ, ఇంట్లో కూర్చుని, నేను చేసేదేముందండీ! పదండి నేనూ వస్తా'' అంటూ కాఫీ కప్పు సింక్‌లో పడేసి కారెక్కి కూర్చున్నా.

అది ఏప్రిల్ నెల. ఉదయం ఆరున్నరయింది. అప్పుడే తెలవారింది. రోడ్లన్నీ ఖాళీ. అప్పుడే మొలకరించిన లేతాకు పచ్చ ఆకులతో, కొమ్మలతో వసంతకాలం కన్నులవిందుగా ఉంది. అబ్బ! ఈప్రకృతికి ఈ అందాలన్నీ ఎవరిస్తారబ్బా'' అనిపించింది ఒక్క క్షణం. పదిహేను నిముషాల్లో బాలాజీగుడి చేరుకున్నాం. చిన్నగుట్టమీద చుట్టూ దట్టమైన చెట్లతో చక్కగా కట్టారు ఆ కోవెలని. ఆ ఊళ్లో ఉన్నది వందకుటుంబాలే అయినా, బాగా పట్టుదలున్న ఒక పది తెలుగు కుటుంబాలు కలిసి, పది లక్షలకుపైగా డబ్బుపెట్టి కట్టారాగుడిని.

కారుదిగి, ఆ ఆలయప్రాంగణంలోకి అడుగు పెట్టేసరికి ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి పాడిన సుప్రభాతం, సన్నగా, మధురంగా వినిపిస్తోంది. కోవిలలో ఇంకా ఎవరూ లేరు. అలాంటి సమయంలో గర్భగుడిలో దేవదర్శనం చేసుకుంటే కలిగే మనశ్శాంతి అంతా ఇంతా కాదంటాడు శంకరం. అందుకే ప్రతి శనివారం, భార్య కూతురుతో సహా వచ్చి ఓ రెండు గంటలు కోవెలలో గడుపుతాడు. వాళ్లు ముగ్గురూ ఒకరి మనసు లొకరు బాగా అర్థంచేసుకొని ప్రవర్తించే వ్యక్తులు. వాళ్లతోబాటూ గర్భగుడిలోకి అడుగు పెట్టేసరికి ఏదో ప్రశాంతత ఆవరించింది నన్ను. చక్కగా అమర్చిన అలంకారాలతో వెలిగిపోతూంది ఆ విగ్రహం. గర్భగుడిలో హారతి, ప్రసాదం తీసుకొని బయట మెట్లమీద కూర్చున్నా. సన్నగా వేణువు, వీణ, వయొలిన్ వాద్యాలతో పంచరత్నకీర్తనలు వినబడుతున్నాయి. అవి వింటూంటే చిన్నతనం గుర్తుకొచ్చింది.

* * * *

నేను బాగా మడీ ఆచారం ఉన్న శ్రోత్రియ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టా. నిప్పుని కూడా నీళ్లతో కడిగేసేటంతటి ఛాదస్తం మానాన్నది. ఉదయం నాలుగు గంటలకి లేచి, చలికాలం అయినా, తలమీంచి నిలువునా స్నానంచేసి, చిన్న గావంచా గుడ్డతో, గంటలతరబడి దేవ చింతనలో గడిపే ఛాందసుడు నా తండ్రి. భర్త కష్ట, సుఖాలు చూసుకోవడం, ఆయనకు కావలసినవన్నీ అమర్చడమే తనజీవిత లక్ష్యంగా భావించేది అమ్మ. చిన్నప్పటినుంచీ సైంటిఫిక్‌గా ఆలోచించే మనస్తత్వం నాది. ఈ ఆచారాలు, ఛాదస్తాలు అవీ మూఢనమ్మకాలని, వాటికి ఏమాత్రం సైంటిఫిక్ బేసిస్ లేదని అనిపించేది నాకు. కాని, ఏనాడూ నేను మా అమ్మకుగాని, నాన్నకుగాని తిరగబడలేదు. నాకు పదహారు సంవత్సరాలు దాటి, కాలేజీలో చేరేముందు ఉపనయనం చేస్తానని పట్టు బట్టేరు నాన్న. చేస్తేచెయ్యండి గాని, నేను సంధ్యావందనం, గాయత్రీమంత్రం రోజా సాధన చేసేది లేదని చెప్పేను నేను. ఏమనుకున్నారో ఏమో, నాన్న నన్ను బలవంతం చెయ్యలేదు. నా చెల్లెలు సంధ్యకి మంచి సంబంధం, కేవలం జాతకాలు కుదరక వదిలేసు కుంటూంటే, ''మీరు మరీ యింత మూఢ నమ్మకాలకు బానిసలయిపోవడం బాగులేదు'' అని నాన్నతో దెబ్బలాడేను.

''ఇది నీకు సంబంధించిన విషయంకాదు. ఇందులో నీ ప్రమేయం అనవసరం'' అని వేరే సంబంధం చూసి పెళ్లి చేసేరు నాన్న. పెళ్లికి నన్ను రమ్మని ఒక్క ఉత్తరం ముక్కకూడా వ్రాయలేదు నాన్న. నా అహాన్ని నాలోనే అణుచుకొని సంధ్యపెళ్లికి వెళ్లా. అప్పటికి నేను వైజాగ్‌లో ఎమ్.ఎస్.సి. చేస్తున్నా. తమ్ముడు చంద్రానికి పదిహేను సంవత్సరాలు. సంధ్య పెళ్లిలోనే చంద్రానికి ఉపనయనంచేశారు. పెద్దాడికి చెయ్యకుండా చిన్నాడికి ఉపనయనం చేస్తారూ అని అందరూ ముక్కుమీద వేలు వేసుకుంటే, ''పెద్దవాడు భ్రష్టుడు. నేనుగాని, నా ఆలిగాని ఛస్తే, మాకు కొరివి పెట్టడానికి వారసుడుండాలి కదా, అందుకే చంద్రానికి ఉపనయనం చేస్తున్నా'' అని నాన్న అందరికీ సమాధానం చెప్పారు. అయన మనసులో అంతకోపం పేరుకు పోయి ఉందని నాకప్పుడు తెలిసింది. చాలా బాధ వేసింది. కాని ఆయన మూఢనమ్మకాలకు దాసోహం చేయడానికి నా మనస్సు ఎందుకో అంగీకరించలేదు.

నేను పి.హెచ్.డి. చేస్తూండగా నాకు లతతో పరిచయమయింది. లత అప్పుడు ఇంగ్లీషు లిటరేచరులో ఎం.ఎ. చేస్తూండేది. లతనాన్నగారు రామారెడ్డిగారు డెప్యూటీ కలక్టర్. మంచి రచయిత. ఆయన రచనలు మంచి భావోక్తంగా ఉండేవి. నాకు చాలా నచ్చేవి. దాని మూలంగా, లతతో పరిచయం. అది మెల్లగా ప్రణయంగామారి, మాపరిణయానికి దారి తీసింది. ఉపనయనం చేసుకోవడానికి అభ్యంతరం పెడితేనే, భ్రష్టుడినని వెలివేసిన నాన్న ఒక రెడ్డి కులం అమ్మాయిని చేసుకుంటానంటే, గంగలో దూకమంటాడని తెలిసి, నాన్నకి చెప్పకుండా, అమ్మకీ, చెల్లెలికీ ఉత్తరాలు రాసి,నా వివాహం గురించి తెలిపి, గుప్తంగా, క్లుప్తంగా, స్నేహితుల సహకారంతో రిజిష్ట్రార్ ఆఫీసులో సంతకాలుచేసి, భార్యాభర్తల మయ్యాం నేను, లతా.

''మీకు దేవుడూ దయ్యాలమీద నమ్మకంలేదన్న సంగతి నాకు తెలుసు. వాటి మీద నమ్మకం నాకు ఉందో లేదో తెలీదు. కాని ప్రశాంతంగా ఉన్నసమయంలో, ఆ కొండమీద వేంకటేశ్వరస్వామి గుడికి పోయి, ఆ విగ్రహంముందు చేతులు జోడించి కళ్లుమూసుకుంటే, నాలో ఏదో అనూహ్యమైన, అపూర్వమైన ప్రశాంతత కలుగుతుంది. రేపుదయం ఏడుగంటలకల్లా అక్కడికి వస్తారు కదూ! అక్కడే, ఆ పరమాత్మముందు,

త్రికరణశుద్ధిగా మనం భార్యాభర్తల మవుదాం. నాకోసం ఈ చిన్నకోరికను మన్నిస్తారు కదూ'' అంది చిన్నగా నవ్వుతూ లత. లత మనస్సులోని ఊహలను పూర్తిగా గ్రహించగలడు తను. ఆమె సునిశిత స్వభావంకలది. ఆత్మవంచనకు తలపడదు. అర్థంలేని మూఢాచారాలను సంఘనిర్బంధనలను తనలాగే ఎంతో ఖండిస్తుంది. దేవుడేమిటి? మతమేమిటి? అవన్నీ మనం పెట్టుకున్నవే. మనో వికాసానికి వీలులేకుండా మనమనస్సుని బంధించే శృంఖలాలు, శిలాశాసనాలవంటివి అంటాడుతను. ''సృష్టిలో ఎంతో విచిత్రం ఉంది. అది ఏ సైంటిస్ట్‌కీ చిక్కలేదు. అంతుబడలేదు. ఈ విశ్వసృష్టికి కారణం ఎక్కడో. ఏదో నిగూఢమైన శక్తి ఉందంటారా, లేదా. ఆ శక్తే, ఆది శక్తి అనండి లేదా పరమాత్మ అనండి. మనకది ఊహాతీతం కాబట్టి, అటువంటి శక్తి అనేదిలేదు అనే వాదన కేవలం వితండవాదన అవుతుంది. కాని ఆ పేరుతో మూఢాచారాలకు బలి అయిపోవడం తెలివి తక్కువ తనం. మన మనస్సునకు నచ్చినది మనం చేద్దాం. అందులో ఆత్మవంచన ఏముందీ! చేతులు జోడించి, గర్భగుడిలో ఆ విగ్రహంముందు ప్రభాతసమయంలో నిలబడితే అదోరకమైన ప్రశాంతత కలుగుతుంది నాలో. అందుకని గుడికిపోవడం ఆత్మవంచన అంటారా'' అంటుంది లత.

ఆమె కోరికను కాదనలేక ఆ మర్నాడు ఉదయం ఏడుగంటలకు విశాఖపట్నంలో సముద్రపు ఒడ్డున కొండమీది వేంకటేశ్వరస్వామి కోవెలకి వెళ్లాం. ఉత్తి చేతులతో జంటగా గర్భగుడిలోకి అడుగు పెట్టిన మమ్మల్ని చూసి ఆశ్చర్యపోయాడు ఆ పూజారి.

''శాస్త్రి గారూ ఈయన రవి. నిన్ననే మావివాహం రిజిస్ట్రార్ ఆఫీస్‌లో అయింది. దర్శనానికి వచ్చేం'' అంది లత చేతులు జోడిస్తూ. ఒక్కక్షణం తెల్లబోయిన ఆయన తేరుకొని ''దీర్ఘసుమంగళీభవ'' అని దీవించేరు లతను. బయట సముద్రహోరు చిన్నగా వినబడుతోంది. చిరుగాలి చల్లగా, మెల్లగా మాశరీరాలను తాకుతోంది. ఏదో చెప్పలేని భావం. దాన్ని పరిపూర్ణత అంటారో, మరేమో, ఒక రకమైన ప్రశాంతత నన్ను ఆవహించింది. నాకు తెలియకుండానే కళ్లు మూసుకుని చేతులు జోడించా.

లత అమ్మా నాన్నాగారూ మాపెళ్లికి రాలేదు. కాని రెడ్డిగారు మమ్మల్ని అభినందిస్తూ, ఉత్తరం రాశేరు. తరువాత పెళ్లయిన ఏడాదికల్లా అమెరికా వచ్చి, మెల్లగా లాసెంజెలెస్ దగ్గర స్థిరపడ్డాం మేము. నాకు మాకుటుంబంతో పూర్తిగా సంబంధం తెగిపోయింది. అప్పుడప్పుడు చెల్లి సంధ్య ఉత్తరం రాస్తూ ఉండేది. లతమట్టుకు వాళ్లకుటుంబానికి తరచుగా ఉత్తరాలు రాస్తూ ఉండేది. క్రమ క్రమంగా మేం అమెరికా జీవితానికి అలవాటు పడ్డాం.

రోజులూ, నెలలూ, సంవత్సరాలూ దొర్లుకుంటూ వెళ్లిపోసాగాయి. మా పెళ్లయి పది సంవత్సరాలు పైబడినా లత మాతృత్వాన్ని పొందలేక పోయింది. రెండుసార్లు గర్భంధరించినా అది నిలవక మూడోనెలనో, నాలుగోనెలనో గర్భస్రావం అయిపోయింది. అయ్యో తండ్రిని కాలేకపోయానే అన్నబాధ నాకెన్నడూ కలగలేదు. కాని ఎప్పుడూ నిండుకుండలా ఉండే లతలో మాత్రం అప్పుడప్పుడు ఏదో కలతో, కలవరమో కనిపించడం నాకు బాధగా అనిపించింది. పిల్లలు లేకపోతేపోమేరు, మనం ఒకరికొకరు ఉన్నాంకదా అని నేనెప్పుడూ సముదాయించేవాణ్ణి. ''పిల్లలు లేకపోతే ఏదో వెలితిగా ఉందండీ''అని వాపోయేది లత. ఒక్కోసారి పోనీ ఇండియా వెళ్లి ఏదో అనాథశరణాలయంలోని బిడ్డను తెచ్చుకుని పెంచుకుందామా అనిపించేది. నేను అలా చేద్దామనా లతని ప్రోత్సహించేవాణ్ణి. కాని, లతలో ఏదో ఆశ. తనరక్తం పంచుకొని ఒక బిడ్డ కలుగుతుందేమోనని ప్రతి నెలా ఎదురు చూసేది. కాని నిరాశ ఎదురయ్యేది.

ఒకసారి, మాఊరికి ఓ గంటదూరంలో ఉన్న మేలిబూ వెళ్దామంది లత. ఏమిటి సంగతి? అని ప్రశ్నించా.

''ఏమిటోనండీ! నా మనస్సుని నేనే సమాధాన పరచుకొని సర్దుకొనే ఆత్మస్థైర్యం కలదాన్నని ఇన్నాళ్లు అనుకునేదాన్ని. కాని ఎందుకో నాకు చేయూత కావాలనిపిస్తోంది. అన్ని సమయాల్లో నాకు మీరు అండదండగా ఉంటారని తెలుసు. కాని ఏదో ఒక అతీతమైన శక్తి నన్ను బలంగా లాగుతూందండీ, అది తట్టుకోవాలంటే నాకు మానవసహాయం సరిపోదేమోననిపిస్తోంది నాకు. ఏ సైకియాట్రిస్ట్ దగ్గరకోపోయి, గంటసేపు నామనోవ్యథ నంతా చెప్పుకునే అవసరం నాకు లేదు. ఆ విధంగా నాకు కావలసిన ఆసరా ఎప్పుడూ మీ వద్దనుండి నాకు లభిస్తోంది. నా మనస్సుకి ప్రశాంతత కావాలి. నాలో అనుక్షణం చెలరేగే అలజడికి ఉపశమనం కావాలి.విశాఖపట్నంలో ఉండే రోజుల్లో ఆ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆ విగ్రహంముందు చేతులు జోడించి నిలబడితే, చెప్పలేనంత ధైర్యం ప్రశాంతత కలిగేవి. అందుకే మేలిబూ వెడదామంటున్నాను. నాకు తెలుసు మీరేమంటారో. దేవుణ్ణి ప్రార్థిస్తే, నీకు పిల్లలు కలుగుతారా అని అంటారు. గుడికి పోతే మీకు ఆత్మవంచన చేసుకున్నట్టవుతుంది అవునా! కాని, నాకు ఇది కావాలని అడగటానికి వెళ్లటంలేదు నేను. నన్ను ఇలాంటి కష్టాల్లో ఎందుకు పెట్టావు తండ్రీ అని నిలదీసి అడగటానికి వెళ్లటంలేదు. నా మనస్సు దారంతెగిన గాలి పటకంలా దారీ, తెన్నూ లేకుండా పోతూంది. దానికి ఒక మార్గం చూపించడానికి వెళ్తున్నాను. పరిపరివిధాల పోతున్న నా మనస్సు కేంద్రీకరించడానికి ఒక పరికరంకోసం వెళ్తున్నాను. నాకు ఉన్నట్టుండి అదృష్టం ఎదురవ్వాలనేది కాదు నాఆశ. ఎదురయితే మంచిదే. కాని, నాజీవితం దురదృష్టాలమయం అయితే తట్టుకోగలచే శక్తిని, మనస్థైర్యాన్ని సంపాదించాలనేదే నా ఆశయం. చిన్న పిల్లలకి బాధకలిగితే ఏ బొమ్మనో ఆటవస్తువునో చూపించి బాధను మరిపించటానికి ప్రయత్నిస్తాం. అలాగే ఇదీనూ. ఈవిధంగానైనా నాబాధను నేను ఉపశమించగలనేమోనని నా ఆశ. నేనిలా అడగటం అసమంజసం అంటారా'' అని అడిగింది లత. నాకు అప్పుడు 42 సంవత్సరాలు. వయస్సువల్లనో లేదా నాలో క్రొత్తమార్పు వచ్చిందోకాని, లతకోరికకు అడ్డుపెట్టలేదు. ప్రతి శనివారం ఉదయాన్నేలేచి సూర్యోదయ సమయానికి ఆగుడికి చేరుకునే వాళ్లం/ కొన్నాళ్లకి అది మాకు అలవాటయిపోయింది. మొదట్లో గర్భగుడిలోకి పోయి చేతులు జోడించాలంటే ఎంతో వింతగా అనిపించేది. కాని క్రమేణా అదీ అలవాటయిపోయింది. ఏది ఏమైనా, నాలో మనమతంమీద విపరీతమైన గౌరవంగాని, దైవభక్తిగాని కలగలేదు. నిజంగా దేవుడున్నాడా? ప్రతివారం వచ్చి ఓ రాతి బొమ్మను మొక్కుతున్న ఈనాటి మానవుడికి, రాతియుగ మానవుడికి ఏమిటి తేడా! ఇంతటి విజ్ఞానం సంపాదించికూడా మనదృక్పథంలో ఎందుకు మార్పులేదూ అనిపించేది. కాని లత అడిగే అతి స్వల్పమైన ప్రశ్నకు సమాధానం దొరికేది కాదు. తాడులేని బొంగరంలా, దారంతెగిన గాలిపటంలా ఆత్రంతో ఆందోళనతో కొట్టుకుపోయే మనస్సుని అదుపులో పెట్టడానికి ఒక కేంద్రీకరణబిందువుగా, ఆ పరమాత్మ పరబ్రహ్మ అనే శక్తిని మనముందు నిలబెట్టి ప్రార్థిస్తే అది రాతియుగం మానవుడి ప్రవర్తన అవుతుందా? ఆ భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ చెప్పినట్టు, మన కర్తవ్యాన్ని మనంవిధించి, ఆ ఫలాన్ని ఆ పరమాత్మకు ధారపోస్తే కలిగే

అనిర్వచనీయమైన బంధవిముక్తి, ఆత్మవంచన అవుతుందా? అనేది లత. దానికి నేనేం సమాధానంచెప్పను! చెప్పడానికి నాదగ్గర సమాధానం అంటూ ఉందా! కొన్నాళ్లకి మానాన్న చనిపోయినట్టు వార్త వచ్చింది. అంత్యక్రియలు చేసేది చంద్రం అయినా, 14 సంవత్సరాలతర్వాత కనీసం ఆఖరు చూపుగా నైనా నాన్నని చూద్దామని విశాఖపట్నం దగ్గర లోగీశ అగ్రహారం వెళ్లా. అక్కడుండగా తెలిసింది మాకు, కలకత్తాలో ఒక అనాథ ఆశ్రమంలో ఓ రెండునెలల పసివాణ్ణి మేం దత్తత చేసుకోవడానికి, అన్ని ఏర్పాట్లు జరిగాయని. నాన్న అంత్యక్రియలయింతర్వాత, కలకత్తా వెళ్లి ఆ పిల్లవాణ్ణి తీసుకొని తిరిగి అమెరికా ప్రయాణం కట్టాం. లత కోరికమీద ఆ పిల్లవాడికి, మా నాన్న పేరు సూర్యం అని పెట్టాం. సూర్యానికి రెండు సంవత్సరాలు. ఈ రెండు సంవత్సరాలలో నేనేం మారలేదు. కాని ప్రతి శనివారం, కోవెలకు పోతాను. ఎందుకు? ఆత్మశాంతికా, మనోస్థైర్యానికా, కాకపోవచ్చు. కాని అదో పరిపాటి అయిపోయింది. ఆ పరిపాటిలో లభించే ప్రశాంతతకు ఎలా విలువ కట్టేది? గుళ్లూ, గోపురాలూ ఎందుకు, మనకి; దాని బదులు ఆ సొమ్ము తీసుకొని ఏ కుంతి, గుడ్డివారి సంస్కరణసంఘానికో విరాళంగా ఇస్తే తోటి మానవుడికి సహాయపడ్డామే అన్న మానవతావాదిని నేను. కాని నాలో మెల్లగా కలుగుతున్న మార్పుకి నాకే ఆశ్చర్యం వేసేది. చిన్నప్పుడు అనవసరంగా నాన్నకి క్షోభకలిగించానే అన్న ఆలోచన మొట్టమొదటి సారిగా నాలో తలెత్తింది. మనవేదాల్లోనైతేనేం, ఉపనిషత్తుల్లోనైతేనేం, భగవద్గీతలోనైతేనేం, సరిగ్గా చదివి అర్థంచేసుకుంటే గనక నాప్రశ్నలకు, లత ప్రశ్నలకు సంతృప్తికరమైన సమాధానాలు దొరుకుతాయేమోనన్న తలపు నాలో రావటం గమనించా. మనజీవితాన్ని క్రమబద్ధంగా మలచుకోవడానికి, ఒక క్రమశిక్షణమీద మనం నడుచుకోడానికీ, ఒక పరికరంగా గుడిని, గుడిలోని విగ్రహాన్ని ఉపయోగించుకుంటే అందులో తప్పేముంది. కోట్లకొలదీ డాలర్లు, కార్లమీద, బట్టలమీద, వెకేషన్లమీద ఖర్చుపెడతామే, అలాంటిది, మనసంస్కృతి, మన ఆచారాలనీ బలపరుస్తూ మనందరనీ, ఒక తాడుమీద నడపడానికని ఒక దేవాలయ నిర్మాణానికి, ఒక పదిలక్షల డాలర్లు ఖర్చుపెడితే, అందులో వృథా ఏముంది?

''రంగపురవిహార'' కంచు ఘంటంలా, చక్కగా మంగళకరంగా, ఎమ్.ఎస్.సుబ్బలక్ష్మి గొంతు వినిపిస్తోంది. చిన్నప్పుడు అమ్మ ఆ పాట పాడేది. తనకెంతో ఇష్టమనీ మళ్లీ మళ్లీ పాడించుకునేవాడు తను. ఆలోచనకి ఉద్వాసన చెప్పి లోపల శంకరం, లక్ష్మి ఎక్కడున్నారో చూద్దామని బయలుదేరా.

* * * *

గుడి లోపల జరిగే మంత్రాలు, భజనలు, కబుర్లూ, మెలమెల్లగా ఎక్కువవుతూంటే ఇంక అక్కడనుండి బయటపడాలనిపించింది. ఒక వరసా వాడీలేని భజన్లు, దానికితోడు ఒక పక్క అమ్మలక్కల కబుర్లు, మగవాళ్ల మంతనాలు, పిల్లల అరుపులు, ఇక చాలని, శంకరంకోసం వెతుక్కుంటూ ప్రక్కనున్న ఆడిటోరియం బిల్డింగులోకెళ్లా.

''రవిగారూ ఇంటికెళ్దాం అంటారా! శంకర్ మీటింగ్‌లో ఉన్నారు. ఇంకొంచెంసేపులో మీటింగ్ అయిపోతుంది. కావాలంటే మీరెళ్లి కూర్చోండి శంకర్‌తో'' అంది లక్ష్మి.

''ఫరవాలేదండీ! ఆడిటోరియంలో కూర్చుంటా'' అని ఆడిటోరియంకి బయలుదేరా. ఆడిటోరియములో స్టేజిమీద ఒకామె ఒక ఐదారేళ్ల పాపకు నాట్యం నేర్పుతోంది. ఆ పాప చెయలేక కష్టపడుతోంది. కొంచెం దూరంలో ఆ పిల్ల తల్లీ, తండ్రీ కాబోలు, కూర్చొని వాదించుకుంటున్నారు. భార్య అమెరికన్.

''హే రాజా, వై డూ యూ పుట్ హెర్ త్రూ దిస్. షి డజంట్ కేర్ ఫర్ ఇండియన్ డాన్స్'' అంటోంది ఆమె భర్తతో.

''లిండా, షి ఈజ్ ఓన్లీ సిక్స్, షి డజ్‌నాట్ నో వాట్ షి వాంట్స్. షి ఈజ్ మై డాటర్, షి ఈజ్ మై బ్లడ్. షి షుడ్ లెర్న్ అవర్ కల్చర్ టూ'' అంటున్నాడు రోషంగా ఆ ఇండియన్ భర్త.

ఓ మూల ఆ ఆడిటోరియంలో ఒకామె ఓ టీనేజర్‌కి ''నగుమోము కనలేని'' అభేరి రాగంలోని కీర్తనను పలికించడానికి ప్రయత్నిస్తోంది. ఆ అమ్మాయి ''నాగుమోము – ఖానలేని'' అని ఆపసోపాలు పడుతోంది. ఇంతల్లో పెద్ద పెద్ద అరుపులు వినిపించేయి. ఏమిటా అని చూస్తే, ఎగ్జిక్యూటివ్ కమిటీ వాళ్లు కాబోలు, మాటమీద మాటవచ్చి, పెద్దగా అరచుకోవడం మొదలెట్టారు.

''మా ఆయన్ని అనడానికి నీకెంత ధైర్యం'' అంటోంది ఓనారీమణి.

''మీ ఆయన డబ్బు పడేసు కోగాలేంది నేనంటే తప్పేముంది'' అని దబాయిస్తోంది ఇంకో కాంతామణి.

''అలా అన్నందుకు నిన్ను కోర్టుకెక్కిస్తా'' అన్నాడో మగధీరుడు. వాతావరణం అంతా గోలగోలగా తయారయింది. వాళ్లంతా తన్నుకున్నంత పని చేశారు.

లతచెప్పినదానికి భిన్నంగా గుడి, దేవుడూ అన్నవి మనలోని గర్వాన్ని, అహాన్ని అణచి పెట్టడానికి కాకుండా, తమస్వార్థానికి, అవసరానికి అనుగుణంగా మార్చుకున్నవారు కోకొల్లలే. అలాంటి వారికి, ఈ మతం, దేవుడు, గుడి అనేవి వాళ్ల అహానికి ఆజ్యంపోసి ద్వేషాలు రగుల్కొల్పుతున్నాయి. అలాంటప్పుడు ఎందుకు ఈ గుళ్లు, ఈ మతాలు. దేవులపల్లి కృష్ణశాస్త్రి గారెప్పుడో చెప్పారు, ''రోషాలు ద్వేషాలు మతమైతే, కలహాలు కక్షలు మతమైతే, మతంవద్దు గీతంవద్దు, మారణహోమం వద్దు'' అని. ఆయన చెప్పినట్టు మనుష్యుల మధ్య వైరం, ద్వేషం కలిగించే పరికరాలు అనవసరం మనకి. ఇంకెప్పుడూ గుడికి పోకూడదనిపించింది ఆ క్షణంలో.

''రవీ మతంపేరున, దేవుడిపేరున, మానవులు తన్నుకుంటే, అది మతం తప్పంటావా? దేవుడి తప్పంటావా? మన వేదాల్లో, శాస్త్రాలలో చెప్పినది పాటించి, సన్మార్గంలో నడుచుకున్నవారు లేనే లేరా? నీ మనసుకి నచ్చింది, నువ్వు పాటించి తృప్తి పొందు. అదే నీకు చాలు!'' చెవిలో రహస్యం చెప్పినట్టు నాన్నమాట వినిపించింది. నిజమేనేమో! పరాయివాళ్ల తత్వాలకు తనకు సంబంధం ఏముంది? తనకు నచ్చింది తను చెయ్యవచ్చు. కాని కాలం మారింది.మానవుడు మారేడు. ఏది ఏమయినా మన పద్ధతుల్లో మార్పు రావాలి. ఎప్పుడో వేల్ల సంవత్సరాలక్రితం మనం అమర్చుకున్న పద్ధతులు ఈ ఇరవైయ్యొకటో శతాబ్దంలో కూడా పాటించాలన్నది కేవలం మూర్ఖత్వం. మనంచేసే పూజలూ, వ్రతాలూ, ఆ వ్రతాల కథలూకూడా, ఈ నవయుగ మానవుడికి అన్వయించేటట్లుగా ఉండాలి. ఏ శంకరాచార్యుల్లాంటి మతప్రబోధకుడో మన మతగ్రంథాలకన్నింటికీ పట్టిన చెదపురుగుల్ని దులపాలి. ఈనాటి మానవుడు పాటించేటందుకు అనుగుణంగా వాటిన్నిటినీ తిరిగి రచించాలి. మన మతానికి పునర్జన్మ కావాలి. కులం అనేది ఈకాలం మానవుడికి వర్తించదు. దాన్ని వేళ్లతో సహా నిర్మూలించాలి. అప్పుడే మనమతం ఇండియాలోనే కాదు పైదేశాల్లో కూడా తరతరాలకు చెదరకుండా నిలుస్తుంది. ఈ పాశ్చాత్యదేశాల్లో గుళ్లు కట్టేస్తే సరిపోదు. వాటికి కనీసం

రెండు మూడు తరాల వరకైనా సరియైన పోషణ చేయాలంటే, మనపిల్లలకీ, మనవలకీకూడా అర్థమయ్యేభాషలో, శైలిలో, వారికి రుచించే టట్లుగా మనమతంగురించి బోధించాలి. మనంగుళ్లు కట్టేస్తున్నాం కాని మన పిల్లలకు వాటిగురించి ఏ మాత్రం శిక్షణ యిస్తున్నాం? ఎవరు చేయాలి అటువంటి మతబోధను? తల్లి తండ్రులా? మరి ఎంతమంది తల్లితండ్రులు చేస్తున్నారవి? ....ఇలాంటి ప్రశ్నలేవో మొలకెత్తాయి నాలో. ఇన్నాళ్లూ ఇటువంటి వాటితో ప్రమేయం లేకుండా గడపేశాడు తను. కాని వీటితో సంబంధం పెంచుకుంటున్నాడే తను: ఇప్పుడు వీటిని తలుచుకుంటే, ఏదో ఒక చేదుభావన మిగులుతోంది లోలోన. ఏంచేస్తాం; ఉగాది ప్చచడి వంటివి ఈ మతం, ఈ సంస్కృతి, ఆచారాలూ; తీపితో బాటు పులుపూ, చేదు మిళితం అయివుంటాయి. ఉగాది పచ్చడిలోని తీపిని చవి చూడాలంటే, చేదును భరించక తప్పదు.

"సారీ రా రవీ, ఈ గొడవల్లో నువ్విరుక్కున్నావు; ఏం అనుక్కోకు. పదపోదాం" అంటున్న శంకరం వెంట మౌనంగా బయటకు నడిచా!

దొందుకు దొందే

"ఏమిటిలా వచ్చావ్, ఫాస్టస్?"
"విన్ను చూదామనే వంచితుణ్ణని నను
జూచి జాలిపడే మేధావీ!
ఇప్పుడేమంటావ్?"
"ఔనయ్యా, ఫాస్టస్. మన ఇద్దరి
జీవితాల్లో కథైక్యత వుంది సుమీ!
గమనించావా నీవది?
శాస్త్రోషరక్షేత్రాల్లో దైవం ఫలించదని
అసురశక్తి నాశ్రయించి
అథఃపతనం చెందావు నాడు
మతం గతాసువని నమ్మి
మానుష శక్తి నాశ్రయించి
అథఃపతనం చెందాను నేడు
బుద్ధిజనితోన్మాదులం మనం
దొందుకు దొందే."
'ఆపు నీ అశ్రుసిక్త దయావాణి."
– డాక్టర్ గంటి శ్రీరామమూర్తి

BURGdORff
REALTORS

TRIVENI GURIKAR, CRS, GRI
SALES ASSOCIATE
NJAR MILLION DOLLAR SALES CLUB 1990
EVENINGS: (201) 335-0118

176 ROUTE 46 ■ DENVILLE, NJ 07834
(201) 625-9300 Fax: (201) 625-8255

మహస్సు

ప్రసాద్ వి. తూములూరి
కొలంబస్, ఒహాయో

ఈసాఅనుకో, అల్లాఅనుకో
కావాలంటే రాముడెయనుకో ||2||
అనుకోదగ్గ పరమాత్మునికీ
ఎన్నోపేర్లు ఉన్నాయనుకో ||2||
||ఈసాఅనుకో!!

గీతచెప్పిన సలహాయైనా
కొరానుచేసిన శాసనమైనా ||2||
బైబిలుతెలిపే బోధయైనా
గ్రంధసాహెబు గురియైనా ||2||

విశ్వమానవ కల్యాణానికే
అన్నిమతాల ఆదిఉద్యమం ||2||
అదితెలుసుకొని మనముంటే
ఎంతోసుఖము పొందుతాం ||2||
||ఈసాఅనుకో|

అయోధ్యలోన అల్లాఉన్నా
మెక్కాలో మధుభంజకుడున్నా ||2||
మతేతరంగా బ్రతికినప్పుడే
మానవాళికి మహోదయం ||2||

మతాలపేరన గతాలుత్రవ్వి
మారణహోమం మలయిస్తూ ||2||
మాగొప్పంటూమాహక్కంటూ
మనమెందుకు మసికావటం ? ||2||
||ఈసాఅనుకో|

మానవతంటే మతముమాత్రమే
కాదన్నదిమనకర్థమైతే ||2||
మందిరమన్నది మనలో, యెదలో
మహస్సు కాగలదందరిలో ||2||

మతములు, భాషలు, మేనిరంగులు
పథములు, పాటులు, అలవాట్లూ ||2||
పదిరకాలుగా ప్రపంచమున్నా
అన్నిరకాలది ప్రాణమొక్కటే! ||2||
||ఈసాఅనుకో|